క్లుప్తంగా

వెంకట నరసమ్మకు నివాళి



మచిలీపట్నంటౌన్: మాజీ కౌన్సిలర్ పరింకాయల శ్రీనివాసరావు సతీమణి వెంకట నరసమ్మ(80) మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) స్థానిక మాచవరంలోని శ్రీనివాసరావు నివాసం వద్దకు వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు, 2వ డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్‌ను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకె వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, పల్లి శేఖర్, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, పార్టీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు తదితరులు ఉన్నారు. అనంతరం జరిగిన ఆమె అంతిమయాత్ర, అంత్యక్రియల్లో కూడా వారు పాల్గొన్నారు.

కిరణ్‌పాల్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు



మచిలీపట్నంటౌన్: నగరంలోని బెరాకా మినిస్ట్రీస్ సంస్థ అధినేత, సామాజిక సేవా కార్యకర్త బ్రదర్ బీఎస్ కిరణ్‌పాల్‌కు నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఇండియా) న్యూఢిల్లీ సంస్థ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును మంగళవారం ప్రదానం చేసింది. నగరంలోని కిరణ్‌పాల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ కిరణ్‌పాల్‌కు అవార్డును అందజేశారు. అనంతరం కిరణ్‌పాల్‌ను సత్కరించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



పెడన: మండలంలోని కట్లపల్లికి చెందిన పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ ఆర్జా వెంకటనగేష్ మంగళవారం బోనస్‌ను అందజేశారు. 47 మంది రైతులకు రూ.81,132లను పంపిణీ చేశారు. అత్యధికంగా పాలు పోసినవారిలో ప్రథమ బహుమతి ముక్కు వెంకయ్యకు మిక్సీతో పాటు బోనస్‌ను అందజేశారు. ద్వితీయ బహుమతి ముక్కు హనుమంతరావుకు ఇచ్చారు. గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణగోపీనాథ్, సంఘ అధ్యక్షుడు మాడెం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ పెయ్యేటి బసవ రాజకుమార్, సంఘ పాలక వర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీలో అర్హత సాధించిన వార్డు సచివాలయ కార్యదర్శులు



మచిలీపట్నంటౌన్: నగరపాలకసంస్థ పరిధిలో పనిచేస్తున్న 12 మంది వార్డు సచివాలయ కార్యదర్శులు డీఎస్సీ–2005లో అర్హత సాధించారు. వీరిని నగర కమిషనర్ బాపిరాజు మంగళవారం తన చాంబర్లో అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్సీ రాసేందుకు సెలవులు మంజూరు చేసిన కమిషనర్ బాపిరాజును సచివాలయ కార్యదర్శులు సత్కరించారు. సచివాలయ కార్యదర్శుల జేఏసీ మచిలీపట్నం శాఖ నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ వెంకట రాజేష్ బాబు రాజీనామా

కోసూరువారిపాలెం(మోపిదేవి): ప్రభుత్వ కార్యక్రమాలకు కనీస సమాచారం ఇవ్వకపోవడంతో కలత చెందిన కోసూరువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు సనకా వెంకట రాజేష్‌బాబు తన పదవికి రాజీనామా చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రాజేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్పు రాకపోవడంతో అవమానంగా భావించి పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో స్వర్ణభారతికి అందజేశారు. వైఎస్సార్ సీపీ తరఫున గెలిపొందిన రాజేష్‌బాబు గత ఫిబ్రవరిలో స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేనలో చేరిన విషయం విదితమే.

అభివృద్ధి శూన్యం.. దోపిడీ ఘనం..!

- హంసలదీవి బీచ్ వద్ద కనీస వసతులు కరువు
- 'టోల్' పేరుతో దోపిడీ
- పర్యాటకాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం



కళావిహీనంగా మారిన హంసలదీవి బీచ్



పర్యాటకుల నుంచి టోల్ వసూలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

కోడూరు: కృష్ణా నది సముద్రంలో కలిసే సాగర సంగమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. తీరంలో ఏవిధమైన అభివృద్ధి పనులు చేయకుండా అధికారులు 'టోల్' పేరుతో పర్యాటకులను దోపిడీ చేస్తున్నారు. హంసలదీవి బీచ్ వద్ద పర్యాటకాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు చెల్లిస్తేనే తీరంలోకి అనుమతి

పాలకాయతిప్ప కరకట్ట దగ్గర నుంచి సముద్రం వరకు సీఆర్‌జెడ్ పరిధిలోకి వస్తుందనే సాకు చూపి అటవీ అధికారులు పర్యాటకుల నుంచి 'టోల్' వసూలు చేస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ టోల్ వసూళ్లకు శ్రీకారం చుట్టి పర్యాటకులను భారీ మొత్తంలో దోచేస్తున్నారు. సహజంగా టోల్‌ను వాహనాలకు మాత్రమే పరిమితం చేయాల్సి ఉండగా ఇక్కడ మాత్రం వాహనాలతో పాటు మనుషులకు కూడా టోల్ కట్టించుకుంటున్నారు. పెద్దలకు రూ.20లు, పిల్లలకు రూ.10లు, ద్విచక్ర వాహనాలకు రూ.20లు, ఆటోలకు, కార్లకు రూ.40లు, భారీ వాహనాలకు రూ.100ల చొప్పున టోల్‌ను వసూలు చేస్తున్నారు. ఈ టోల్ నిర్వహణపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా అధికారులు మాత్రం వసూళ్లను ఆపడం లేదు.

కానరాని మౌలిక వసతులు

పాలకాయతిప్ప కరకట్ట వద్ద నుంచి సముద్రం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి పూర్తి గుంతలమయంగా మారింది. తీరంలో స్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు చీరలు అడ్డుపెట్టుకొని పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడ కనీసం ఒక మరుగుదొడ్డి కూడా నిర్మించలేదు. తీరంలో పర్యాటకులు సేదతీరేందుకు బల్లలు లేవు. తాగడానికి మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదు. బీచ్ వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రం తాళాలకే పరిమితం కాగా, సంగమం వద్ద ఉన్న విశ్రాంతి భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. సాగరసంగమం వద్ద ఉన్న పవిత్ర కృష్ణమ్మ పాదాలు, విగ్రహం శిథిలావస్థకు చేరాయి.

హామీలు నీటిమూటలే..

సాగరసంగమ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామంటూ ప్రభుత్వ పాలకులు గుప్పించిన హామీలు నీటి మూటలకే పరిమితమయ్యాయి. ఎన్నికల ముందు హంసలదీవి బీచ్ అభివృద్ధికి కేంద్రం ద్వారా రూ. 20కోట్ల నిధులు కేటాయిస్తామంటూ ఎంపీ బాలశౌరి చెప్పారు. అయితే ఆ మాటలు కేవలం హామీగానే మిలిగిపోయింది. ఇప్పటికైనా హంసలదీవి బీచ్ అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని యాత్రికులు కోరుతున్నారు.

టోల్ వసూళ్లు సిగ్గుచేటు



అధికారులు టోల్‌ను ఏర్పాటు చేసి తొమ్మిది నెలలుగా పర్యాటకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఆ డబ్బులను అభివృద్ధికి కేటాయిస్తామని చెప్పారే గాని తీరంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. ప్రభుత్వ ఖజానా పెంచడానికి పర్యాటకులను దోపిడీ చేయడం చాలా సిగ్గుచేటు.

– కొక్కిలిగడ్డ భీక్షాలు, సర్పంచి, హంసలదీవి

పర్యాటకుల సంఖ్య తగ్గింది



గతంలో ఎన్నడూ లేని విధంగా టోల్ పేరుతో అడ్డుగోలుగా దోపిడీ చేస్తున్నారు. టోల్ వసూలు, వసతులు లేమితో తీరానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా తగ్గింది. పాలకులు సరైన నిర్ణయం తీసుకోకపోతే సంగమ ప్రాంతం పర్యాటకులకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉంది.

– కొండవీటి వెంకటకుమారి, ఎంపీపీ, కోడూరు

సీఆర్‌పీలకు శిక్షణ

నాగాయలంక: దివిసీమలోని అవనిగడ్డ, కోడూరు, మోపిదేవి, నాగాయలంక మండలాలకు చెందిన 48మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ)లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం తడి – పొడి చెత్త సేకరణపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కైతేపల్లి అంకాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత డెప్యూటీ ఎంపీడీఓ కలపటపు అప్పల నరసమ్మ, నాగాయలంక గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కోడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అతావుల్లా మంగళవారం తెలిపారు. ఎంపీపీ కోట విజయరాధిక అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు



మచిలీపట్నం ఉపాధ్యాయుల రణభేరిలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

మచిలీపట్నం అర్బన్/పెడన/చల్లపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) రణభేరి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా మంగళవారం రణభేరి కార్యక్రమం పెడన, చల్లపల్లి, మచిలీపట్నం చేరుకుంది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఉపాధ్యాయుల ఏ ఒక్క సమస్యకూ పరిష్కారం లభించలేదన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూ వాస్తవానికి ప్రైవేట్ స్కూళ్ల వైపు విద్యార్థులను మళ్లించే విధానాలు అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఉమామహేశ్వరావు, ఎస్పీ మనోహర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడు జె.లెనిన్‌బాబు, కార్యదర్శి డి.కనకారావు, సహాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, జె.ఝాన్సీ, కోశాధికారి మరీదు వరప్రసాద్, సీఐటీయూ నాయకులు బూర సుబ్రహ్మణ్యం, జయరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్ల పని భారాన్ని తగ్గించాలి

మచిలీపట్నంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కృష్ణా జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయుల సమస్యలపై బందరు ఆర్డీఓ కె.స్వాతికు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె. నాగ సోమేశ్వరమ్మ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



పెడన: తామర చెరువులోని గుర్రపు డెక్కను ఎట్టకేలకు తొలగిస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన చేపల చెరువులను బహిరంగ వేలం వేయడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే గత రెండేళ్లుగా ఈ చెరువుకు వేలం పాట నిర్వహిస్తున్నా గుర్రపు డెక్కతో ఎవరూ పాడుకోవడానికి ముందుకు రావడం లేదు. గుర్రపు డెక్క తొలగిస్తే చెరువును పాడుకుంటామని పలువురు మున్సిపల్ అధికారులకు తెలియజేస్తూ వచ్చారు. ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ అధికారులు గత రెండు రోజులుగా గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపట్టారు. మంగళవారం మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఆరో వార్డు కౌన్సిలర్ బాబులాల్, మున్సిపల్ ఏఈ సీతారామాంజనేయులు గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించారు.

18న వేలంపాట

కోనేరుసెంటర్: జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 18 తేదీన పాడైపోయి మరమ్మతులకు పనికిరాని నాన్ గవర్నమెంట్ సామానులకు (పోలీస్ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఉపయోగించిన మోటార్ ట్రక్, పోలీస్ టైలరింగ్ సెంటర్‌లో గల కుట్టు మిషన్లు) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పోలీసు కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు.

వీధిలైట్లు లేక రోడ్డుపై ప్రమాదాలు



మోపిదేవి సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జానకీరాంబాబు

మోపిదేవి: వీధిలైట్లు లేక రోడ్డుపై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోపిదేవి నుంచి అవనిగడ్డ వైపు వెళ్లే జాతీయ రహదారి వరకు వెంటనే వీధిలైట్లు వేయించాలని కోరారు. నిర్మాణంలో నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రం పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని మెరకనపల్లి పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు కోరారు. రావివారిపాలెం, బోడగుంట గ్రామాలకు ప్రత్యేకంగా ఓవర్ హెడ్‌ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని నాయకులు కోరారు. పెదప్రోలు గ్రామంలో గుర్తించిన వృద్ధులకు వారి ఇంటికి రేషన్ ఇవ్వడం లేదని ఆ గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. రేషన్ షాపులను తరచూ తనిఖీ చేయాలని డెప్యూటీ తహసీల్దార్ వాణిని కోరారు. జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జననీ కుమారి, ఏవో పాండురంగారావు, పలువురు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కోడూరు: కృష్ణా నదిలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేది నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీనియర్ రాజకీయవేత్త భోగాది మృతి



పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయవేత్త, బీజేపీ కిషాన్‌మోర్చా నేత, ఆ గ్రామానికి 32 ఏళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన భోగాది వెంకటేశ్వరరావు(95) మంగళవారం మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. భోగాది మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పర్రచివరలో ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు భోగాది రమాదేవి, జనసేన యువనేత మండలి రాజా, పీఏసీఎస్ అధ్యక్షుడు భోగాది నరసింహారావు, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్ తదితరులు భోగాదికి నివాళులర్పించారు.

మినీ గోకులాల అవకతవకలపై చర్యలేవీ..?



బంటుమిల్లి సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ చినబాబు, ఎంపీడీవో నీరజాక్షి

బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో నీరజాక్షి పర్యవేక్షణలో ఎంపీపీ వి.చినబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు నివేదిక సమర్పించి సభ్యుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ఏపీవో రాంప్రసాద్ నివేదిక సమర్పించగా మల్లేశ్వరం, కంచడం, సాతులూరు ఎంపీటీసీలు వీరబాబు, భగవాన్, చినబాబులు(ఎంపీపీ) మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులాల నిర్మాణాలపై జరిగిన అవకతవకలపై ఎటువంటి చర్యలు తీసుకున్నారంటూ అధికారులను నిలదీశారు. దీనిపై ఏపీవో రాంప్రసాద్ స్పందిస్తూ రాతపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు చిన్నారిబాబు, కె.లలిత, యూఆర్టీ శైలజాకుమారి, పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై విచారణ

ఘంటసాల: ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీశివకేశ్వర స్వామివారి ఆలయ భూములు, ఆస్తులు ఆక్రమణల అంశంపై అక్టోబర్ 1న విచారణ చేపడుతున్నట్లు శ్రీజలధీశ్వరస్వామి ఆలయ ఈఓ యార్లగడ్డ వాసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడాలి గ్రామంలోని శ్రీశివకేశ్వర స్వామి ఆలయంలోని భూములు, ఆస్తులు ఆక్రమణలకు గురైనట్లు దేవదాయ ధర్మదాయ శాఖకు ఇటీవల అర్జీలు వచ్చినట్లు చెప్పారు. దీనిపై ఘంటసాల గ్రామంలోని శ్రీజలధీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగే విచారణలో అభ్యంతరాలు, సూచనలు, సలహాలు లిఖిత పూర్వకంగా సమర్పించాలని ఈఓ సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఘంటసాల: ఘంటసాల మండలం గోగినేనిపాలెం పంచాయతీ ప్రాంగణంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కుంపటి సుశీల మంగళవారం తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గోగినేనిపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓజోన్ పొరతో మానవాళికి మేలు

మచిలీపట్నంటౌన్: ఓజోన్ పొరతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్ అన్నారు. కళాశాలలో ఓజోన్ డే కార్యక్రమాన్ని బోటనీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను అధికంగా పెంచడం ద్వారా ఓజోన్ పొరను కాపాడవచ్చని తెలిపారు. బోటనీ విభాగం హెచ్‌ఓడీ సాయి సుస్మిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పాగోలులో పొలం పిలుస్తోంది



చల్లపల్లి: మండలంలోని పాగోలు పంచాయతీ శివారు మేకావారిపాలెం, పుచ్చగడ్డలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకు ఎరువుల వాడకం చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఓ నిహారిక, యువశ్రీ, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు ప్రారంభం



మోపిదేవిలో క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మేరీరాణి, హెచ్‌ఎం జయంతి




డివిజన్ స్థాయి క్రీడలకు ఎంపికైన బాలికల ఖోఖో జట్టు

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి బాలికల ఆటల(క్రీడా) పోటీలను గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జయంతి మాట్లాడుతూ పలు పాఠశాలల నుంచి సుమారు 80 మందికి పైగా క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ, చెస్, బ్యాడ్మింటన్ వంటి క్రీడాంశాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను మండలం నుంచి ఎంపిక చేసినట్లు వివరించారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక హైస్కూల్ గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి బాలికల కబడ్డీ, ఖోఖో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్, తలగడదీవి, భావదేవరపల్లి, ఎదురుమొండి, ఏటిమొగ హైస్కూల్స్‌కు చెందిన 200మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో బాలికల కబడ్డీ, ఖోఖో జట్లును ఎంపిక చేశారు. అలాగే స్పోర్ట్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన క్రీడారులను బందరు డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. మండల క్రీడల ఇన్‌చార్జిగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ గాజుల లక్ష్మీప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.పి.ఎల్ ప్రసాద్, బడే వెంకటేశ్వరరావు, టి.వి రత్నకుమారి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



నాగాయతిప్ప(మోపిదేవి): మండలంలోని నాగాయతిప్పలో ఉపాధి నిధులు రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, కోసూరువారిపాలెంలో రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ. 38.50 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం ప్రాంభించారు. కోసూరువారిపాలెంలో కోసూరు గోపాలకృష్ణమూర్తి, లక్ష్మీకాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కోసూరు అంజయ్య, వెంకటేశ్వరావు, రవీంద్రరావు సుమారు రూ. లక్ష విలువైన మార్చురీ బాక్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామ పంచాయతీకి అందజేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుకు సబ్సిడీపై డ్రోన్ అందించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, గామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రామ కోటేశ్వరావు పాల్గొన్నారు.